క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటు



వినుకొండ(నూజెండ్ల): బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ వినుకొండ విభాగాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఆవరణలో బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సర్కిల్ ప్రెసిడెంట్ కె.ఎస్. కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ పే కమిషన్ జాప్యానికి గల కారణాలు, భవిష్యత్ పెన్షన్ సవరణ కేంద్ర వేతన సంఘ సిఫార్సులను గురించి వివరించారు. సంఘం గుంటూరు జిల్లా సెక్రటరీ వై.బాబురావు, వినుకొండ బ్రాంచ్ సెక్రటరీ సీహెచ్. ఏడుకొండలు, నరసరావుపేట సెక్రటరీ నాగశంకర్, అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఏజీఎం రామిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

శంకర సత్సంగం పునరుద్ధరణ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సన్నిధి వారివీధిలో ఉన్న సన్నిధి వెంకట ఆంజనేయులు, నాసరమ్మ గార్ల ధ్యాన మందిరంలో ఆదివారం శ్రీ శంకర సత్సంగం పునరుద్ధరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా సిద్దేశ్వరం సమీపంలోని పునుగోడు గ్రామానికి చెందిన శుద్ధ చైతన్యానంద స్వామీజీ, శిష్య బృందం గురుపూజ చేశారు. అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శంకర సత్సంగం నిర్వాహకురాలు తెలగంశెట్టి పావనిదేవి మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా మేము ఇక్కడ సత్సంగం నిర్వహిస్తున్నామని, ఇటీవల ఈ ధ్యాన మందిరం ఆధునికీకరణ చేసి ప్రారంభించినట్లు తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వినుకొండ(నూజెండ్ల): వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే సందర్భంగా పట్టణంలోని శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించిందని హాస్పటల్ ఎంఎస్ ఆర్థో, జాయింట్ రీప్లేస్మెంట్ ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కొరివిపాడు అభిషేక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైద్యశాలలో రూ.2వేల విలువైన వైద్య సేవలను ఉచితంగా అందించామని, అనేక మందికి వారి ప్రస్తుత పరిస్థితులపై అవగాహన కల్పించామన్నారు. బీఎండీ అనే పరీక్ష నిర్వహించి వారి ఎముకల ధృడత్వం, ఎముకల పటిష్టత గురించి తెలియజేసి సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. సుమారు 250మందికి పైగా పేషెంట్లు హాజరైనట్లు తెలిపారు. ఇంతటి అవకాశం కల్పించిన హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణకాంత్ గార్లపాటి, డాక్టర్ జ్ఞానేశ్వరి గార్లపాటికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక



పృథ్వీసాయి మణికంఠ

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, క్రీడాకారుడు దాలరాజు పృథ్వీసాయి మణికంఠ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 26 నుంచి 29వ తేదీవరకు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగనున్న దక్షిణభారత అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఏఎన్‌యూ జట్టు తరపున పాల్గొననున్నాడు. ఇటీవల జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి ఏడుగురు సభ్యుల జట్టులో స్థానం సాధించాడు. ప్రస్తుతం నరసరావుపేటలో డిగ్రీ విద్యాభ్యాసం చేస్తున్నాడు. తండ్రి సాంబశివరావు సాతులూరు హైస్కూలులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది జాతీయస్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో రెండు మెడల్స్ సాధించి సత్తా చాటాడు. ఏఎన్‌యూ జట్టుకు ఎంపికైన పృథ్వీసాయి మణికంఠను హైస్కూలు హెచ్ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ మాఫియాకు అడ్డుకట్ట

చిలకలూరిపేట: నియోజకవర్గంలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయడానికి జనసేన పనిచేస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్ చెప్పారు. నియోజకవర్గ పరిధిలో పలుమార్లు రేషన్ బియ్యం పట్టుబడిన నేపథ్యంలో జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభాని, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మునీర్‌హసన్ పాల్గొన్నారు.

అప్రమత్తత.. పరిశుభ్రతే శ్రీరామరక్ష

- వర్షాలతో పశువుల్లో సీజనల్ వ్యాధులు
- పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి
- పశుశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి



పాడి గేదెలు



రొంపిచర్ల: ఇటీవల కురుస్తున్న వర్షాలతో చాలీచాలని పశువుల షెడ్‌లు, పాకల్లో ఉండే పశువులు సీజనల్‌గా వచ్చే వ్యాధుల బారిన పడుతున్నాయి. వర్షాలకు పశువుల్లో పలు రకాల వ్యాధులు ప్రభలుతున్నాయి. సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధులను ముందుగానే గమనించటంలో పశుపోషకులు తగు జాగ్రత్తలు వహిస్తే వాటి నుంచి రక్షించుకోవచ్చు. వర్షాకాలంలో పశువుల్లో పొదుగు వాపు, జ్వరం, నోటిలో, కాళ్లపై పుండ్లు, గొంతు వాపు, శ్వాస సమస్యలు, దగ్గు, ముక్కులో నుంచి నీరు కారడం, చర్మంపై బొబ్బలు రావటం, వెంట్రుకలు రాలిపోయి పుండ్లు రావటం లాంటి జబ్బులు వస్తుంటాయి. అపరిశుభ్రంగా ఉన్న పశువుల శాలల్లో ఉండటం వల్ల ఎక్కువగా జబ్బుల బారిన పడుతుంటాయి. జబ్బు బారిన పడిన పశువుకు అవసరమైన వైద్యాన్ని కూడా అపరిశుభ్రమైన ప్రదేశం నుంచే అందించాల్సి వస్తుంది. పశుపాలకులు కనీస జాగ్రత్తలు తీసుకుంటే పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవటంతో పాటు పాల దిగుబడి కూడా తగ్గకుండా చూసుకోవచ్చు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- రైతులు తమ పశువులు సేదతీరే ప్రాంతంలో బురద, తేమ లేకుండా చూసుకోవాలి
- గాలి, వెలుతురు వచ్చేవిధంగా పశువులశాలను ఏర్పాటు చేయాలి
- పశువుల మల, మూత్ర విసర్జనను ఎప్పటికప్పుడు తొలగించాలి
- పశువులు పడుకునే ప్రాంతంలో బురదలేకుండా చూసుకోవటంతో పాటు పాలు ఇచ్చే పశువుల పొదుగుల దగ్గర బురద లేకుండా చూడాలి.
- ఎట్టి పరిస్థితుల్లోను గేదెలను వర్షంలో కట్టివేయకూడదు.
- పశువుల పాకల్లో, షెడ్‌లలో మేత వేసే గాడులను క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.
- తేమ ఉన్న ప్రాంతంలో, నీరు నిలబడే ప్రాంతంలో పశుగ్రాసాన్ని నిల్వ ఉంచితే కుళ్లిపోయే ప్రమాదం ఉంది. ఆ మేతను పశువులు తింటే కాలేయం కూడా దెబ్బ తింటుంది.
- పశువుల కాళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. గిట్టల మధ్య పేరుకు పోయిన మట్టిని, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలి.

దోమ పోటు అధికం..

వర్షాకాల సీజన్‌లో దోమ పోటు ఎక్కువగా ఉంటుంది. దోమ కాటు వల్ల పాడి పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. దోమల బారి నుండి పశువులను రక్షించుకునేందుకు దోమతెరలు ఉపయోగించటం శ్రేయస్కరం. పశువుల్లో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా తగు వైద్యం చేయించాలి. పశువుల పెంపకంలో కనీస జాగ్రత్తలు వహిస్తే సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షించుకోవచ్చు. పశువులపై వెచ్చించే పెట్టుబడి కూడా తగ్గుతుంది. పాల దిగుబడులు కూడా నిలకడగా ఉండటంతో పాటు పెంపకంలో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా చూసుకోవచ్చు.

సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి



పశుపోషకులు పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందుగా హెచ్ఎస్, ఎఫ్ఎండీ వంటి వ్యాక్సిన్‌లు వేయించాలి. పశువుల పాకాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు సాధ్యమైనంత వరకు పాడి గ్రాసాన్ని పశువులకు అందించాలి. పరిశుభ్రమైన నీరును పశువులకు తాగించాలి. రైతులు కనీస జాగ్రత్తలు పాటిస్తే వర్షాకాలంలో వచ్చే వ్యాధులను నుంచి పశు సంపదను రక్షించుకోవచ్చు.

– డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి, పశువైద్యాధికారి, కర్లకుంట

పల్లె పండుగతో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు

ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి



సంకురాత్రిపాడులో శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి, అధికారులు

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు, సంకురాత్రిపాడు గ్రామాల్లో ఆదివారం పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు. రెండు గ్రామాల్లో రూ.23 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ, ఈ నెల 14న ప్రారంభమైన పల్లెపండుగతో గ్రామాల్లో ప్రగతి కాంతులు వచ్చాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టిందన్నారు. సంక్రాంతి పండుగ నాటికి పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపారాణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు. రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. శిలాఫలకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మునమాక గ్రామ సర్పంచ్ మృతి

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



రొంపిచర్ల : మండలంలో మునమాక గ్రామ సర్పంచ్ సయ్యద్ జాన్ సైదా (45) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. నరసరావుపేట మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గ్రామ సర్పంచ్‌గా, వైఎస్సార్ సీపీ నాయకుడిగా జాన్ సైదా గ్రామాభివృద్ధికి, పార్టీ బలోపేతానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పడాల చక్రారెడ్డి, వెంకట్రావు, పడాల హనిమిరెడ్డి, పాల్గొన్నారు.

రాజకీయ కారణాలతో ఉద్యోగుల తొలగింపు సరికాదు



శిబిరంలో దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం తెలిపిన కోటేశ్వరరావు, జిలానీ మాలిక్

నరసరావుపేట: రాజకీయ కారణాలతో తొలగించిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పల్నాడు జిల్లా బాలోత్సవ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరావు కోరారు. తమను మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గత 18రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం నిర్వహిస్తున్న ఉద్యోగులను డీఎస్ఏ స్టేడియం మాజీ కమిటీ సభ్యుడు జిలానీ మాలిక్‌తో కలిసి సందర్శించి వారికి తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు శిలార్ మసూద్, పట్టణ కార్యదర్శి చిన్న అల్లాభక్షు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

నాదెండ్ల: జాతీయ రహదారి గణపవరం గ్రామ పరిధిలోని వీరా అసోసియేట్స్ స్పిన్నింగ్ మిల్లు సమీపంలో శనివారం అర్ధరాత్రి వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తుతెలియని మృతదేహంగా పోలీసులు వివరాలు నమోదు చేసుకుని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే మృతుడు పెదనందిపాడుకు చెందిన వేలూరి సుబ్బారావు (65)గా గుర్తించారు. కొద్దిరోజులుగా మతిస్థిమితం కోల్పోయి శుక్రవారం ఇంటి నుంచి వెళ్ళిపోయాడని, శనివారం అర్ధరాత్రి 2.30– 3 గంటల సమయంలో జాతీయ రహదారిపై ప్రమాదంలో మరణించినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి కుమార్తె స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోటయ్య సంస్మరణ సభను జయప్రదం చేయండి



ఆర్టీసీ బస్టాండ్ వద్ద కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: పల్నాటి పీడిత ప్రజల నాయకుడు, అమరుడు కామ్రేడ్ చల్లా (బరిసె) కోటయ్య సంస్మరణకు చెందిన కరపత్రాన్ని ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 7న దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో కోటయ్య తీవ్ర అనారోగ్యంతో అమరులయ్యారని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు చెప్పారు. పేద కుటుంబంలో పుట్టి గ్రామంలో భూస్వామ్య, అగ్రవర్ణ పెత్తందారులకు వ్యతిరేకంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీల హక్కుల కోసం పోరాడి అనేక విజయాలు సాధించారని అన్నారు. ఈనెల 21 సోమవారం గ్రామంలో నిర్వహించే సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, పౌరహక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ సికినం చిన్న పాల్గొన్నారు.

వర్షపు నీటి ప్రవాహానికి మార్గం సుగమం



కాలువల్లో పూడిక తీత పనులు

నాదెండ్ల: అల్పపీడనం ప్రభావంతో గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గణపవరం శివారు శివప్రియనగర్ వర్షపు నీటితో నిండిపోయింది. చిలకలూరిపేట పట్టణం నుంచి గణపవరం వెళ్ళే డొంక రోడ్డు నీట మునిగి అస్తవ్యస్తంగా మారింది. వర్షపు నీరు సమీపంలోని కుప్పగంజివాగులో కలిసే మార్గం సరిగా లేక నీరు నిలిచిపోయింది. దీంతో శివప్రియనగర్ ప్లాట్ల యజమానులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించి పొక్లెయినర్‌తో డ్రెయినేజీలో పేరుకున్న చెత్తా, చెదారాలు తొలగించారు. ఏఎంజీ దగ్గర నుంచి జాతీయ రహదారిపై షాపులు పెట్టుకుని సైడుకాల్వలను మూసివేయటంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. మురుగునీరు పారుదల నిలిచిపోకుండా శుభ్రం చేయించారు. దీనిపై ప్లాట్ల యజమానుల సంఘం నాయకులు పేలూరి రామారావు, దివ్వెల సుబ్రహ్మణ్యం, ఎ.వీరాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా అట్లతద్ది



అట్లతద్ది కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, భక్తులు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో వాసవి కామధేను క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అట్లతద్ది కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వర గానామృతాన్ని జీఎస్ఆర్ గజలక్ష్మి భక్త బృందం ఆలపించారు. అనంతరం గౌరీవ్రతం, లింగాష్టకం కార్యక్రమాల్లో మహిళలు పాల్గొన్నారు. అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో పూరా సుజాత, భాస్కరరావు, అన్నదాన కమిటీ కన్వీనర్ బత్తుల మురళీ, మట్ట ప్రసాద్, ఆత్మకూరి రాజేంద్రప్రసాద్, గొడవర్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్టిక్కర్‌ను ఆవిష్కరించారు.

నేడు నాదెండ్లలో ప్రత్తిపాటి పర్యటన

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో సోమవారం జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరుకానున్నట్లు టీడీపీ అధ్యక్షుడు మండల బండారుపల్లి సత్యనారాయణ తెలిపారు. పల్లె పండుగ సందర్భంగా గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కసరత్తు

శావల్యాపురం: విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల విద్యుత్‌శాఖాధికారి జవ్వాజి నటరాజ్ శనివారం తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషనులో ఏఈ నటరాజ్ మాట్లాడుతూ తొలిదశలో ప్రభుత్వ కార్యాలయాలు, కేటగిరి–2 విద్యుత్ మీటర్ల, వీధిలైట్లు, రక్షిత మంచినీటి పథకాలకు స్మార్ట్ మీటర్లు అమర్చే పనులు జరుగుతున్నాయన్నారు. స్మార్ట్ మీటరు అమల్లోకి రాగానే బ్యాలెన్స్ ఉన్నంతవరకే విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. నగదు అయిపోయిన వెంటనే విద్యుత్ సరఫరా బంద్ అవుతుందని, రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగులుంటాయన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో 520 స్మార్ట్ మీటర్ల మంజూరు కాగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సముదాయాలు కేటగిరి–2 వాటికి స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నట్లు తెలిపారు. కేవలం శావల్యాపురం గ్రామంలో మాత్రమే 212 స్మార్ట్ మీటర్లు మంజూరు అయినట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట: సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గానికి చెందిన ఎనిమిది మందికి ఆదివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పట్టణానికి చెందిన జి లక్ష్మి పార్వతికి రూ. 51,310, డి నాగప్రసన్నబాయికి రూ. 40,600, గణపవరంకు చెందిన కె పావనికి రూ. 1.50లక్షలు, లింగంగుంట్లకు చెందిన రమాదేవికి రూ. 95,601, జి శివకుమార్‌కు రూ. 25వేలు, కావూరుకు చెందిన శ్రీనివాసరావుకు రూ. 75వేలు, అప్పాపురంకు చెందిన నాగేశ్వరరావుకు రూ. 1,51,333, దింతెనపాడుకు చెందిన రామారావుకు రూ. 1,02,619 లను అందజేశారు.

ఓటరు నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ఓటరు నమోదు సహాయ కేంద్రంలో యూటీఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి కోరారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 2025 మార్చిలో నిర్వహిస్తారన్నారు. గత ఎన్నికల ఓటరు జాబితా రద్దయిన కారణంగా తిరిగి అందరూ ఓట్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 2021 నవంబర్ ఒకటి నాటికి డిగ్రీ పాసైన అందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, డిగ్రీ పట్టా నకలు, ఆధార్‌కార్డు నకలు వివరాలతో ఓటరుగా ఆన్‌లైన్‌లో అప్లయి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.తిరుపతిస్వామి, నాయకులు జె.పార్థసారధి, టి.సత్యనారాయణ, బిత్రా నాగేశ్వరరావు, ఎస్కె ఎండీ యాసిన్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కాపు హాస్టల్ నిర్మాణానికి అండగా ఉంటాం

శ్రీకృష్ణదేవరాయ కాపు నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



ప్రమాణస్వీకారం చేసిన కాపు నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: కాపు సంక్షేమం, కాపు హాస్టల్ నిర్మాణానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఆదివారం జమిందారు ఫంక్షన్‌హాలులో నిర్వహించిన శ్రీకృష్ణదేవారయ కాపు సంఘ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాపులు, తెలగలు, బలిజలు అందరూ అన్నదమ్ములు లాంటివారని అన్నారు. కాపు సంఘం అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన పోతుల శంకర్ మాట్లాడుతూ కాపు కల్యాణ మండప నిర్మాణంకోసం తన ఆస్తిలో సగం రాసి ఇస్తానని ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులు అందరూ కలిసికట్టుగా పనిచేసి కాపు కల్యాణ మండపం నిర్మాణం, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇచ్చేలా అందరం కృషిచేయాలని అన్నారు. తొలుత కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి దివంగతనేత వంగవీటి మోహన్‌రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శిగా మంచాల వెంకట తిరుపతిరావు, కోశాధికారి వై.రామమోహనరావు పాటు పలువురు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేయగా, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, రామిశెట్టి కొండ, కోవూరి బాబు, అల్లంశెట్టి మోహనరావు, రామకోటేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఉద్యోగి బంగారయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాషా

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వం పాఠశాల విద్యను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా తెలిపారు. పల్నాడురోడ్డులోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పల్నాడుజిల్లా కార్యవర్గ సమావేశంలో చాంద్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీఓను రద్దు చేసి 3,4,5, తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కు తీసుకవచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఉపాధ్యాయులు తమ వృత్తికి పునరంకితంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్, మక్కెన శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సయ్యద్ కరిముల్లా, మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

భారీవర్షంతో ఇక్కట్లు



రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం భారీగా వర్షాలు కురిసాయి. మండల కేంద్రానికి దక్షిణ దిక్కుగా ఉన్న వీరపట్నం, అన్నవరప్పాడు, రైతు నగర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. అధిక వర్షంతో డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లు జలమయమయ్యాయి. దాదాపు రెండు గంటల పాటు మోకాళ్ల లోతు నీరు పారింది. పల్లు ప్రాంతాల్లో ఉన్న కొన్ని గృహాల్లోకి, పశువుల పాకల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. అయితే చొప్పదొడ్లలో ఉన్న ఎండు పశుగ్రాసానికి ఈ వర్షపు నీరు కొంత మేర నష్టం కలిస్తుందని గ్రామస్తులు తెలిపారు.

ఇన్నర్‌వీల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మంజుల



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చిలకలూరిపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు ఇన్నర్‌వీల్ క్లబ్ కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని మంజూ నర్సింగ్ హోమ్‌లో సన్ ఫార్మా లేబరేటరీ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా షుగర్, హెచ్‌బీఏ1సి, థైరాయిడ్, పాదాల న్యూరోపతి వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ మంజుల రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు తియ్యగూర రమాదేవి, పోతినేని పద్మావతి పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 130మందికి పరీక్షలు

నరసరావుపేట: పట్టణ ఒడియరాజుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్స్ విజన్ కంటి వైద్యశాల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వడ్డెర సంఘం నాయకులు తిరుమలకొండ నరసింహారావు సారథ్యంలో వడ్డెర కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన శిబిరంలో డాక్టర్ చెంచిరెడ్డి పాల్గొని 130మందికి కంటి పరీక్షలు చేశారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు.